# సింగిల్ పేజీ కథలు

## కస్టమర్

చక్రవర్తి నగల దుకాణంలోనికి అడుగుపెట్టేసరికి 'మీ సేవయే మా ధ్యేయం' అన్న బోర్డు కన్పించింది. అది నగరంలోకెల్లా అతి పెద్ద దుకాణం. అందులో అడుగుపెట్టిన వారందరికీ వి.ఐ.పి ట్రీట్‌మెంట్. అందుకే అతడి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వెలుగుతోంది.

''ఏం కావాలి సార్?'' అని తియ్యని గొంతుతో సేల్స్‌గర్ల్ అడిగింది.

భూలోక దేవతలా ఉన్న ఆ అమ్మాయిని చూసి చక్రవర్తికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఇంతలో మరో అమ్మాయి వచ్చి ''కూర్చోండి సార్'' అంది.

అతడు మొహమాటపడుతూనే ''పర్లేదండి'' అంటూ కూర్చొని ''బంగారు గాజులు చూపించండి'' అన్నాడు.


అతడి మొహమాటం చూసి సేల్స్ గర్ల్ చిన్నగా నవ్వుకుంది. ఆమె సర్వీసులో ఇలాంటివారిని చాలామందిని చూసింది. వీరిచేత ఏదో ఒక వస్తువు కొనిపించటం చాలా తేలిక అనుకుంటూ నాలుగయిదు బాక్సులు తెచ్చి అతని ముందుంచింది.

వాటిలో ప్లెయిన్ గాజులు నుండి వజ్రాలు పొదిగిన వాటివరకు రకరకాల డిజైన్లలో ఉన్నాయి. అతడికి కళ్ళు జిగేల్మన్నాయి.

''సార్.. కాఫీ, టీ, కూల్‌డ్రింకు..ఏం తీసుకుంటారు?'' అని అడిగింది సేల్స్‌గర్ల్.

మొహమాటపడుతూనే ''ఏం వద్దు'' అన్నాడు చక్రవర్తి.

''పర్లేదు సార్, మీరు ఏదో ఒకటి తీసుకోవాలి''




చక్రవర్తి జవాబు చెప్పకుండా, ఏ రకం గాజులు తన భార్యకి సరిపోతాయా? అని ఆలోచిస్తున్నాడు.

సేల్స్‌గర్ల్ చనువుగా ''సార్‌కి పెప్సీ తీసుకురా అప్పారావు'' అని బాయ్‌కి ఆర్డరిచ్చింది.

''అయ్యో వద్దండీ'' అంటూనే గాజులు చూడటంలో నిగమ్నమయిపోయాడు.

సేల్స్‌గర్ల్ అతని చేతిలో ఉన్న గాజుల వైపు చూసి ''ఇవి లేటెస్ట్ మోడల్ సార్'' అంది.

ఇంతలో బాయ్ పెప్సీ తెచ్చి చక్రవర్తి ముందు పెట్టాడు. కాస్త ఇబ్బంది పడుతూనే పెప్సీ తాగుతూ ''ప్రస్తుతం బంగారం రేటు ఎలా ఉంది?'' అన్నాడు.

''నాలుగు నుండి అయిదువేల వరకు ఉంది సార్'' అంటూ అతని చేతిలో ఉన్న గాజులను చూపించి ''వీటిని ప్యాక్ చేయమంటారా?'' అని అడిగింది.

''సరే'' అని చెప్పి చక్రవర్తి క్యాష్ కౌంటరు దగ్గరకు వెళ్ళాడు.

బిల్లు తీసుకుని పది రూపాయలు తక్కువ ఇచ్చాడు.

కేషియర్ డబ్బు లెక్కకట్టి ''సార్..పది రూపాయలు తక్కువ'' అన్నాడు.

''అవును. నేను వద్దన్నా డ్రింకు ఇప్పించారు. కానీ ఆ డబ్బులు ఏదో ఒక రూపంలో కస్టమర్ మీదే వేస్తారు. నాకిష్టం లేకుండా మీ బలవంతం మీద తాగిన డ్రింకుకి నేనెందుకు డబ్బులివ్వాలి?''

కేషియర్‌కి, అతడి సర్వీసులో ఎవ్వరూ ఇలాంటి షాక్ ఇవ్వకపోవటంతో గుడ్లప్పగించి చక్రవర్తిని చూస్తూనే ఉన్నాడు.


చక్రవర్తి నిదానంగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

**-మరడ వెంకట దాశరథిరావు**
(సూరత్)

## చెప్పేందుకే నీతులు

ఫ్రెండ్ సులోచన బ్యాంక్ ఆఫీసర్‌గా హైదరాబాద్ వచ్చినట్టు తెలుసుకున్న సునీత, ఓ శెలవురోజున వాళ్ళింటికి వెళ్ళింది. ఇద్దరూ ముచ్చటగా కాలేజీ కబుర్లూ, సంసారంలో సాధకబాధకాలూ, ఉద్యోగాల్లో సమస్యలూ చర్చించుకున్నారు.

అలా మాట్లాడుతూనే, పనమ్మాయి మల్లికను గమనిస్తోంది సునీత. పట్టుమని పదేళ్ళయినా లేని ఆ పిల్లలో చురుతనం, చేసే పనిపట్ల శ్రద్ధ, పరిశుభ్రతా ఇట్టే గ్రహించేసింది.



పని పూర్తిచేసుకుని మల్లి వెళ్ళిపోయాక, యథాలాపంగా మల్లి వివరాలు అడిగి తెలుసుకుని, ''సులోచనా.. మల్లి మీ ఇంట్లో ఇలా పనిచేస్తున్నట్టు ఎవరికైనా తెలిస్తే ప్రమాదం సుమా..'' అన్నది.

''ఏమిటి ప్రమాదం?'' అర్థంకాక అడిగింది సులోచన.

''ఇలా చిన్నపిల్లల చేత చాకిరీ చేయించడం బాలకార్మిక చట్టరీత్యా పెద్దనేరం! ఇలా పనిచేయించే యజమానులకు పనిష్మెంట్ వుంటుంది. ఈమధ్య సి.ఎం.గారు, ఈ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా వుంటున్నారు. బాల బాలికలచేత పన్లు మాన్పించి, విద్యాబుద్ధులు చెప్పించి, తమ కాళ్ళమీద తాము నిలబడే వెసులుబాటు కలిగించాలనేది ఆయన తపన. అందుకే ఎవరూ పిల్లలు పనిచేయడం లేదు...పత్రికలు చదవడం లేదా సులోచనా?''

''నేనింకా న్యూస్ పేపర్ తెప్పించడం లేదు. నాకు తెలియదు సుమా..కాని, సి.ఎం.గారు చెప్పింది అక్షరాలా నిజమే. మన పిల్లలతోబాటు చదువుకుని, విజ్ఞానవంతులు కావలసిన వయసులో, వారిచేత ఇంటిపని చేయించడం నేరమే కాదు, అమానుషం కూడా! మా ఇంట్లో పనిచేసేది మల్లికాదు. చంద్రమ్మనుకో. తనకేదైనా పని వున్నప్పుడు కూతురు మల్లిని ఇలా పంపుతూంటుంది. ఇకనుంచీ ఇలా కూడా పంపొద్దనీ, నేనే చేసుకుంటాను. ఒంటికి ఎక్సర్‌సైజ్ కూడాను. మల్లిచేత చేయించను. ఈ ఆలోచనే రాని నాకు బాగా గుర్తుచేసినందుకు థాంక్స్ సునీతా..''

''దానికేంలే. నీలోనూ మానవత్వం వుందని నిరూపించావ్. మరి నేను వెడతాను. వీలు చూసుకుని మా ఇంటికి రా. వచ్చేముందు ఫోన్ చేసి రావాలిసుమా! మరేంలేదు నేను ఒక్తి బద్దకిస్ట్‌ని. సహవాసదోషంతో మరింత పెరిగింది. మావారు రాజకీయ నాయకులు కదా..కాస్త ఇల్లు నీట్‌గా సర్దివుంచుదామని..'' అంటూ, ఫ్రెండ్‌కి గుడ్‌బై చెప్పి, ఇంటికెళ్ళిపోయింది సునీత.

చాలారోజుల తర్వాత ఏదో పనిబడి, సునీత ఇంటివైపు వెడుతూ, ఆమెని కూడా ఓసారి చూద్దామని వాళ్ళింటికెళ్ళింది. ఇంట్లో అడుగుపెట్టిన సులోచన ఎదురుగా కనిపించే దృశ్యం చూసి... అంతే షాక్‌తో బిగుసుకుపోయింది.

మీకు తెలిసిపోయింది కదూ, సునీత ఇంట్లో పని చేస్తున్నది మల్లి అని!

**-ఎ.అన్నపూర్ణ** (హైదరాబాద్)

# పొరపాటు

''చూడండి శంకరయ్యగారూ! నా ప్రయత్నం నేను చేశాను. అయినా మీ జబ్బేమిటో నాకు అంతు చిక్కడం లేదు. హైదరాబాదుకు వెళ్లండి. అక్కడ పేరు పొందిన డాక్టర్లు చాలామంది వున్నారు. మీ ఆరోగ్యం బాగవుతుంది. నా మాట వినండి'' నచ్చజెప్పాడు డాక్టరు చౌదరి.

శంకరయ్యది తుంగభద్ర నది ఒడ్డున వున్న చిన్న పల్లెటూరు. ఒక మోస్తరు రైతు. శంకరయ్యే కుటుంబానికి ఆధారం. ఈ మధ్యకాలంలో శంకరయ్య ఆరోగ్యం క్షీణిస్తోంది. చూడ్డానికి అన్ని విధాలా బాగానే కన్పిస్తాడు. కానీ ఏదో తెలియని నీరసం. ఏ పని చేతకాదు. టౌనులో మంచి డాక్టర్లకే చూపించాడు. ఎన్నో మందులు వాడాడు. అయినా ఫలితం కనిపించలేదు.

''నువ్వు పట్నమెళ్లి చూపించుకో అన్నా. ఇక్కడ అన్ని పనులు నేను చూసుకుంటాగా. నీవేం మాపై దిగులుంచుకోవద్దు. ముందుగా నీ ఆరోగ్యం చక్కబడాల'' అన్నాడు పెద్దతమ్ముడు వీరయ్య.

''నిజమే. నేను బాగుంటేనే కదా నా కుటుంబం బాగుండేది. అందరూ ఇదే సలహా ఇస్తున్నారు. వానలు పడేలోగా వెళ్లొస్తేనే మంచిది'' నిర్ణయించుకున్నాడు. డాక్టరు చౌదరితో అన్ని విషయాలు రాయించుకొని హైదరాబాద్‌కు బయలుదేరాడు శంకరయ్య.

''ఒక్కరోజులో మెడికల్ రిపోర్టులన్నీ వచ్చేస్తాయి. నువ్వే తీసుకున్నా సరే. లేదా అడ్రస్ ఇచ్చి వెళ్తే అన్నీ పరిశీలించి వివరాలన్నీ మీకు తెలుపుతాం'' అన్నాడు డాక్టరు.

''ఊరికిపోయి మరలా రావడం దండగ. ఒక్కరోజు ఇక్కడే వుండి అన్ని విషయాలు తెలుసుకొని పోవడం మేలు'' అనుకున్నాడు శంకరయ్య. పక్కనే లాడ్జిలో బస చేశాడు.

శంకరయ్య హైదరాబాద్ చేరిన నాటినుండే వాతావరణంలో మార్పు వచ్చింది. బంగాళాఖాతంలో అల్పపీడనం. రాయలసీమ కోస్తా, ఆంధ్రాలో భారీ వర్షాలు రావచ్చునని టీవీ వార్తలు విన్నాడు. పేపర్‌లోను చదివాడు శంకరయ్య.

''వానలే లేవు. అల్పపీడనం ప్రభావం వల్లనైనా వానలు కురిస్తే చాలు. రాయలసీమలో రైతు బతుకు ఏటా ఒక గండంగానే గడిచిపోతుంది. అతివృష్టి, అనావృష్టి ఏదో ఒకటి తప్పదు. ఈ బతుకులు బాగుపడేదెప్పుడో'' నిట్టూర్చాడు శంకరయ్య.

''రాయలసీమలో భారీవర్షాలు'' పేపర్‌లో పెద్దక్షరాలు కనిపిస్తున్నాయి. పేపర్ కొన్నాడు శంకరయ్య.

''రాయలసీమలో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం. తుంగభద్ర డ్యాం గేట్లు ఎత్తి నీటిని నదిలోకి వదలడంతో వరదనీరు తోడై తుంగభద్ర నది ఒడ్డున వున్న వంద గ్రామాలు కనబడకుండా పోయాయి'' స్పష్టంగా వుంది పేపర్లో.

''వంద గ్రామాలు తుడుచుకుపోయాయంటే మా వూరెప్పుడో కొట్టుకుపోయి వుంటుంది. అయ్యో! ఎంత పని జరిగింది దేవుడా'' అంటూ కుప్పకూలిపోయాడు శంకరయ్య.

హాస్పిటల్ పక్కనే కావడంతో అక్కడున్నవారే శంకరయ్యను హాస్పిటల్‌లో చేర్చారు. ''అరే! ఇతడు నిన్ననే మెడికల్ చెకప్ చేయించుకున్నాడు. ఇంతలో ఏం జరిగిందో'' శంకరయ్యను పరీక్ష చేసిన డాక్టరు అక్కడే వుండడంతో శంకరయ్య అడ్రసు సులభంగానే తెలిసింది. ఇంటికి టెలిగ్రాం ఇచ్చారు.

మరునాటికి స్పృహలోకి వచ్చాడు శంకరయ్య. తల్లిదండ్రులు, భార్య, తమ్ముళ్లు తన చుట్టూ అంతా తనవారే.

'ఇది కల కాదు కదా. లేక నేను కూడా చనిపోయి నా వాళ్లందరిని స్వర్గంలో కలుసుకున్నానా. ఆ దేవుడే అందరినీ నా దగ్గరకు పంపాడా' చిత్రంగా అందరివైపు చూడసాగాడు శంకరయ్య.

''అదేమిటండీ అలా చూస్తున్నారు. నేను మీ భార్య లక్ష్మినండి. మీకేం కాలేదు'' అంటూ భర్త చేయి పట్టుకుంది లక్ష్మి.

'నిజమే నాకేం కాలేదు. నా వాళ్లందరూ బతికే వున్నారు' నమ్మకం కుదిరింది శంకరయ్యకు. ''లక్ష్మి! మీరంతా బాగున్నారా. మన వూరికేం కాలేదు కదా'' ఆత్రంగా అడిగాడు శంకరయ్య.

''మీరేం మాట్లాడుతున్నారో మాకర్థం కావడం లేదు. అసలేమయింది మీకు'' గాభరాగా అడిగింది భార్య.

''అది కాదు లక్ష్మి! నిన్న తుంగభద్ర నడి ఒడ్డున వున్న వంద గ్రామాలు కొట్టుకుపోయాయని పేపర్లో..'' అంటూ నసిగాడు శంకరయ్య. ''అందుకేనా మహాప్రభూ తమరు పడిపోవడం. ఇదిగో ఈరోజు పేపర్లో ఏముందో చూడండి'' అంటు పేపర్ చేతికందించింది భార్య.

''నిన్నటి పేపర్లో తుంగభద్ర నది ఒడ్డున వున్న వంద గ్రామాలు నీట మునిగినట్లుగా పొరపాటున ప్రకటించాం. వంద గ్రామాలకు బదులు వంద ఇళ్లు అని చదువుకోగలరు. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాం'' సవరణ అనే హెడ్డింగ్‌తో ప్రత్యేకంగా బాక్స్ కట్టి ప్రచురించారు.

''ఔరా! చిన్న పొరపాటు వల్ల ఎంత పని జరిగింది. అదృష్టం బాగుండి ప్రాణాలతో బయటపడ్డాడు కానీ లేకుంటే పాపం..'' విషయం విన్న అందరూ ముక్కున వేలేసుకున్నారు ఆశ్చర్యంగా.

''శంకరయ్యగారూ మీకో గుడ్ న్యూస్. మీకే జబ్బులేదు. నెర్వస్ సిస్టంలో మైనర్ ప్రాబ్లం. దాన్ని తెలుసుకోలేక అక్కడి డాక్టర్లంతా మిమ్మల్ని ఇబ్బంది పెట్టారు. ఈ మందులు వాడండి చాలు. మీకే సమస్య రాదు'' అన్నాడు నవ్వుతూ డాక్టరు.

అంతా సంతోషంగా వూరు చేరారు.

**-టి.రామాంజనేయులు**
(హాలహర్వి)

★